సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 2 । జూన్ । 2025



మొగల్తూరు మామి'డీలా'

మొగల్తూరు మామిడి ప్రతికూల వాతావరణం, పండుఈగ దాడితో ధర లేక వెలవెలబోతోంది. ఈ ఏడాది సగం కూడా అమ్మకాలు లేని పరిస్థితి. 8లో



వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

వెన్నుపోటు రాజకీయాలకు సీఎం చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. 8లో



శ్రీవారి క్షేత్రంలో రద్దీ

చిన వెంకన్న క్షేత్రంలో రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వేసవి సెలవులు ముగుస్తుండటంతో భక్తులు పోటెత్తుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

విద్యుత్ స్తంభం ఏర్పాటు



సాక్షి స్పందన

ముసునూరు: 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రమణక్కపేట సెక్షన్ పరిధిలోని చెక్కపల్లి సెంటర్‌లో ఏఈ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విరిగిపడే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభాన్ని ఏర్పాటుచేశారు.

చెత్తను తొలగించారు

ఆగిరిపల్లి : 'మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆగిరిపల్లిలోని సగర బజార్‌లో ఎంపీడీఓ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం

భీమవరం: ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర మూడో కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 5న విజయవాడలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు వై.మోహనరావు తెలిపారు. సమావేశంలో 14 ప్రధాన డిమాండ్లపై చర్చించి ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. సమావేశాన్ని జిల్లాలో అన్ని శాఖల, అన్ని తరగతుల ఉద్యోగులు జయప్రదం చేయాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 17 మంది గైర్హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ఓ కేంద్రంలో నిర్వహించారు. 46 మందికి 17 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు.

యోగాపై పోటీలు

ఏలూరు(మెట్రో) : యోగా ద్వారా ఐక్యత–వారధి పేరిట సోమవారం నుంచి 6వ తేదీ వరకు మండలస్థాయిలో యోగాపై పోటీలు నిర్వహిస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. పలు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

నాణ్యమైన సరుకులు అందించాలి

ఏలూరు (టూటౌన్): చౌక డిపోల ద్వారా కచ్చితమైన తూకంతో, నాణ్యమైన సరుకులు ప్రజలకు అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి డీలర్లకు సూచించారు. స్థానిక తంగెళ్లమూడిలో 126, 127 రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీని ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 1,123 రేషన్ దుకాణాల ద్వారా 6,20,146 కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తామన్నారు. 65 ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి వద్దే సరుకులు అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, తహసీల్దార్ శేషగిరిరావు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు అన్యాయం



యర్రగుంటపల్లిలో నిరసన తెలుపుతున్న రైతులు

చింతలపూడి: కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులకు అన్యాయం చేస్తోందని రైతులు మండిపడ్డారు. యర్రగుంటపల్లిలో ఆయిల్‌పామ్ రైతుల సమావేశం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖర్, ఆయిల్‌పామ్ ఏరియా అధ్యక్షుడు పెన్మత్స రామరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకం 27.5 నుంచి 10 శాతానికి తగ్గించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను, ఆయిల్‌పామ్ సాగును దృష్టిలో పెట్టుకుని పామాయిల్ దిగుమతి సుంకం 50 శాతానికి తగ్గకుండా చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. అలాగే పామాయిల్ ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.20 వేల వరకు ఉన్నందున కనీసం మద్దతు ధర టన్ను రూ.22 వేలకు తగ్గకుండా చూడాలన్నారు. క్రూడ్ ఆయిల్ ధర టన్ను రూ.1,25,000 తగ్గకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

కర్షకులపై కక్ష



అన్నం పెట్టే రైతన్న దగా వద్దాడంటూ మొసలి కన్నీరు కార్చారు.. తాము వస్తే రైతే రాజన్నారు.. అన్నదాత సుఖీభవ సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామన్నారు.. తీరా చూస్తే కూటమి పాలన చేపట్టి అప్పుడే ఏడాదవుతోంది. సుఖీభవ సాయం ఇవ్వకపోగా రైతులకు అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన ఉచిత పంటల బీమాకు ఎసరుపెట్టింది. రైతుల కష్టాన్ని దోచుకునేందుకు దళారులకు గేట్లు తెరిచింది. ఆర్‌బీకే వ్యవస్థను నిర్వీర్యం చేసింది.

అన్నదాత.. గుండెకోత


- కూటమి ఏడాది పాలనలో రైతుల దగా
- అన్నదాత సుఖీభవకు మొండిచేయి
- ఉచిత పంటల బీమా పథకానికి ఎసరు
- రైతులపై రూ.29 కోట్ల ప్రీమియం భారం
- అన్నదాతలకు అండగా నిలిచిన జగన్ సర్కారు
- రైతు భరోసా ద్వారా జిల్లాలో రైతులకు రూ.796 కోట్ల లబ్ధి
- అన్ని విధాలా అండగా ఉండేలా ఆర్‌బీకేల ఏర్పాటు



సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్, 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగవుతున్నాయి. ఎన్నికల ప్రచార సభల్లో జిల్లా అంతటా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అన్నదాత సుఖీభవ సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామంటూ ఊదరగొట్టారు. కూటమి అధికారంలోకి రావడంతో సుఖీభవ సాయం కోసం రైతులు గంపెడాసతో ఎదురుచూశారు. ఏడాది ముగిసిపోతున్నా మొదటి ఏడాది సాయం విడుదలపై నోరు మెదపకపోవడం గమనార్హం. కూటమి చేసిన దగాతో జిల్లాలోని దాదాపు 1,17,999 రైతులు రూ.235.99 కోట్లు మేర నష్టపోయినట్టు అంచనా. కాగా వైఎస్సార్ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగుకు ముందే రైతు భరోసా సాయం అందించేవారు. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలకు, రూ.7,500లు జతచేసి ఏటా రూ.13,500లు మొత్తాన్ని ఖరీఫ్ ప్రారంభం, కోతలు, రబీ ప్రారంభంలో మూడు విడతలుగా అందించేవారు. ఇలా ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మంది రైతులకు గత రూ.796.49 కోట్లు పెట్టుబడి సాయం అందించారు.

ఉచిత పంటల బీమాకు ఎసరు

రైతులపై ప్రీమియం భారం లేకుండా 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా వర్తించడం వలన పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ప్రభుత్వంలోని ఐదేళ్లలో జిల్లాలోని ఏడు లక్షల మంది రైతుల తరఫున ప్రీమియం రూపంలో బీమా కంపెనీలకు దాదాపు రూ.140 కోట్లను చెల్లించింది. పంట నష్టపోయిన 1,14,011 మంది రైతులకు రూ. 217.64 కోట్లు పరిహారం అందించి అండగా నిలిచింది. కాగా కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేసి ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. ఎకరాకు పంట విలువ రూ.41 వేలలో ప్రీమియంగా రెండు శాతం మొత్తం రూ.820లు బీమా కంపెనీకి చెల్లించాలి. దీనిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం వాటా అంటే రూ.205 చెల్లిస్తే, మిగిలిన 1.5 శాతం మేర రూ.615 రైతులే చెల్లించాలి. ఇలా జిల్లా రైతాంగంపై సీజన్‌కు సుమారు రూ.29 కోట్ల మేర భారం మోపినట్టు అంచనా.



సాక్షి గ్రాండ్ రిపోర్ట్

దళారులదే హవా

ధాన్యం అమ్మకాల్లో రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా, ఏ దశలో వారి జోక్యానికి ఆస్కారం లేకుండా గత వైఎస్సార్ ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. రైతులకు పూర్తి మద్దతు ధర దక్కేలా ఆర్‌బీకేలు, సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ వచ్చింది. కూటమి వచ్చాక దళారీ వ్యవస్థకు గేట్లు బార్లా తెరవడంతో ఇప్పుడు వారిదే హవా. తేమ శాతం ఎక్కువనో, తాలుగింజలు ఉన్నాయనో చెప్పి మద్దతు ధరకు కోత పెడుతూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు.

అగ్రీ ల్యాబ్‌లదీ అదే దారి

సాగులో నకిలీల బెడదను అరికట్టేందుకు గత ప్రభుత్వం నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌ను ఏర్పాటుచేసింది. రైతులు శాంపిల్స్ తెస్తే చాలు వ్యవసాయం, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి అన్ని పరీక్షలు ఇక్కడ ఉచితంగా నిర్వహించేలా దాదాపు రూ.కోటికి పైగా వ్యయంతో రూపొందించారు. తాడేపల్లిగూడెంలో రీజనల్ కోడింగ్ సెంటర్ (ఆర్‌సీసీ) ఉండటంతో, జిల్లాలో మిగిలిన భీమవరం, ఉండి, నరసాపురం, తణుకు, పాలకొల్లులోను, ఆచంట నియోజకవర్గాల్లో అగ్రీ ల్యాబ్స్‌ను నిర్మించారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో కొన్నిచోట్ల ఇవి నిరుపయోగంగా తయారయ్యాయి.



నరసాపురంలో తాళం వేసి ఉన్న అగ్రీ టెస్టింగ్ ల్యాబ్

గత ప్రభుత్వంలో ఆర్‌బీకేలతో అండగా..

విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు సాగులో రైతుకు అన్ని విధాల అండగా గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. అక్రమాలకు తావులేకుండా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, విపత్తులతో నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందించడంలో కీలకపాత్ర పోషించాయి. జిల్లాలో 253 పంచాయతీల పరిధిలో రూ. 65 కోట్ల వ్యయంతో 298 భవన నిర్మాణాలు చేపట్టగా గత ప్రభుత్వంలోనే 211 భవనాలు వినియోగంలోకి వచ్చి రైతులకు సేవలందిస్తూ వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్‌బీకేలను రైతుసేవా కేంద్రాలుగా పేరు మార్చింది. కొన్ని ఆర్‌బీకే భవనాలు ఇతర కార్యాలయాలకు వినియోగిస్తుండగా, మరి కొన్ని తాళం వేసి కనిపిస్తున్నాయి. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గత ప్రభుత్వంలో రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	1,09,302	147.56
2020–21	1,24,664	168.30
2021–22	1,17,791	159.02
2022–23	1,13,597	153.36
2023–24	1,24,645	168.17

రైతులపై అదనపు భారం



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేది. దీంతో నష్టపరిహారం రైతులకు సకాలంలో అందేది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసింది. రైతులపై అదనపు భారం మోపింది.

– తమనంపూడి శ్రీనివాసరెడ్డి, రైతు, జుత్తిగ



నరసాపురం రూరల్ : నరసాపురంలో రేషన్ షాపు వద్ద క్యూ



ఆకివీడు: బియ్యం మూటతో వృద్ధురాలు

రేషన్ పాట్లు.. మళ్లీ మొదలు

- దుకాణాల వద్ద పడిగాపులు
- పనిచేయని ఈ–పోస్ యంత్రాలు
- ఇంటి వద్దకే రేషన్‌కు కూటమి మంగళం



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లిలో..



భీమవరం అర్బన్ : దెయ్యాలతిప్పలో మూసిఉన్న రేషన్ షాపు

ఏలూరు (టూటౌన్)/భీమవరం : ఇంటింటికీ రేషన్ సరుకులు పోయి రేషన్ దుకాణాల ద్వారా అందించే వ్యవస్థ రావడంతో ప్రజలకు తిరిగి కష్టాలు ప్రారంభమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తొలిరోజు చాలా చోట్ల ఈ–పోస్ మెషీన్లు పనిచేయకపోవడంతో కార్డుదారులు పడిగాపులు కాశారు. కొందరు తాము ఏ షాపులో రేషన్ తీసుకోవాలో తెలియక గందరగోళం నెలకొంది. పలుచోట్ల షాపుల వద్ద క్యూలైన్లు కనిపించాయి. భీమవరం మండలం దెయ్యాలతిప్పలో ఒకరిద్దరికి సరుకులు ఇచ్చి రేషన్ షాపును మూసేశారు. యలమంచిలి మండలం మేడపాడు, నరసాపురం మండలం కొప్పర్రులో ఈ–పోస్ యంత్రాలు పనిచేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. తాడేపల్లిగూడెం రూరల్, ఆకివీడు తదితర ప్రాంతాల్లో రేషన్ సరుకులను దూర ప్రాంతాల నుంచి వచ్చి వాహనాలపై తీసుకువెళ్లడం కనిపించింది. జిల్లాలో 1,060 రేషన్ షాపుల ద్వారా 5.67 లక్షల కార్డుదారులకు నిత్యావసరాలు అందించాల్సి ఉండగా తొలిరోజు పంపిణీ కార్యక్రమం అభాసుపాలయ్యింది.



మూటలు మోయడం మళ్లీ మొదలు



ఉండి : ఎన్నార్పీ అగ్రహారంలో మహిళల పడిగాపులు



యలమంచిలి : ఈ–పోస్ మెషీన్ పనిచేయకపోవడంతో..

వంచనపై ఉద్యమిద్దాం



పెదఅమిరంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- కూటమి దగాపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- 4న 'వెన్నుపోటు దినం' నిరసనకు పిలుపు

సాక్షి, భీమవరం: కూటమి వంచన పాలనకు నిరసనగా ఈనెల 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించతలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన ఆదివారం పెదఅమిరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. నరసాపురం పార్లమెంట్ అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, ఏపీ స్టేట్ బీసీ సెల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నవుడు వెంకటరమణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి తదితరులు హాజరయ్యారు. వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతానికి సమావేశంలో చర్చించారు. కూటమి వంచనపై ప్రజల గొంతుకగా వారి పక్షాన ఉద్యమించాలని నిర్ణయించారు.

ప్రజలను నట్టేట ముంచారు

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నమ్మి ఓట్లేసిన ప్రజలను చంద్రబాబు నట్టేట ముంచారన్నారు. ఏడాది పాలనలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసి సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలు, అరాచకాలు, అన్యాయాలకు నిరసనగా ఈనెల 4న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వెన్నుపోటు దినం నిర్వహించేందుకు అధిష్టానం నిర్ణయించిందన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు భారీ ఎత్తున నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని శాంతియుత ర్యాలీగా తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాలకు చేరుకుని వినతిపత్రాలు అందజేయాలని ప్రసాదరాజు కోరారు.

సంక్షేమాన్ని గాలికొదిలేసి..

పార్లమెంట్ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసి కేసులు, కక్ష సాధింపులు, డైవర్షన్ పాలిటిక్స్‌తో ఏడాది కాలం గడిపేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ కవురు, మహిళా నేత ఉమాబాల, గోపి తదితరులు మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు మరోపేరని, ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పటి నుంచి అదే ఆయన మార్క్ అని ఎద్దేవా చేశారు. అనంతరం 'వెన్నుపోటు దినం' పోస్టర్లను నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్ బందన పూర్ణచంద్రరావు, పార్టీ నేతలు గుణ్ణం నాగబాబు, ఎడ్ల తాతాజీ, కోడే విజయలక్ష్మి, పాల రాంబాబు, పప్పుల రామారావు, కల్వపూడి ప్రసాద్‌రాజు, ముప్పిడి సంపత్ రావు, చినమిల్లి వెంకటరాయుడు, పేరిచర్ల విజయ నరసింహారాజు, గాదిరాజు రామరాజు తదితరులు హాజరయ్యారు.

విద్యాశాఖలో అసంబద్ధ నిర్ణయాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను రోజుకో నిర్ణయంతో గందరగోళానికి గురి చేస్తున్నారని, దీనికి తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీటీఎఫ్ నాయకులు ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ నుంచి మూడు నాలుగు ఐదు తరగతులను వెనక్కి రప్పిస్తామని, తెలుగు మీడియం కొనసాగిస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి మాటలు నీటిమూటలు అయ్యాయని, ఆరు రకాల బడులను సరి చేయమంటే తొమ్మిది రకాల బడులను ప్రవేశపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 1:49గా నిర్ణయించడంతో తగినంత మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉన్నా సర్‌ప్లస్‌గా మిగిలి పోవాల్సి వచ్చిందని, వీరిని ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా కచ్చితంగా వెళ్లాలని బలవంతం చేయడం అన్యాయమన్నారు. అలాగే జూనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎనిమిదేళ్ల పూర్తి కాకపోయినా, రీ అపోర్షన్‌మెంట్ లేకపోయినా కచ్చితంగా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లాలని అధికారులు మౌకికంగా ఆదేశాలు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. తెలుగు మీడియం కొనసాగిస్తే రాష్ట్రంలో ఇంకా దాదాపు పది వేల మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు అవసరం అయ్యేవారని, అదేవిధంగా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 1:40గా నిర్ణయిస్తే ఇప్పుడు మిగిలిన స్కూల్ అసిస్టెంట్లు అందరూ కూడా వారి సేవలను హైస్కూల్ విద్యార్థులకే వినియోగించవచ్చని సూచించారు. ఎలిమెంటరీ హెచ్‌ఎంలను ఎస్జీటీలతో భర్తీ చేయాలని అన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, ప్రధాన కార్యదర్శి బి.రెడ్డి దొర కోరారు.

క్లుప్తంగా

క్రిస్టియన్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ఏలూరు (టూటౌన్): పూర్తి పారదర్శకంగా డీఎస్సీ -2025 పరీక్షకు ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 వేల క్రిస్టియన్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఒకో జిల్లాకు ఒక ప్రశ్నాపత్రం విధానాన్ని అమలుచేయాలన్నారు. ఓసీ అభ్యర్థులకు వయో పరిమితిలో సడలింపు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం, సకాలంలో నియామకాలు చేపట్టడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. ఏదైనా ఆలస్యం జరిగితే నిరంతర ఉపాధ్యాయ ఖాళీల కారణంగా విద్యార్థులు బోధనా వనరులను కోల్పోతారని, తక్షణమే క్రిస్టియన్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన వృద్ధురాలు చెరువులో పడి మృతిచెందింది. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గుడివాకలంక గ్రామానికి చెందిన మోరు లక్ష్మి(85) ఆదివారం గ్రామంలోని చెరువులో మృతిచెంది ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదవశాత్తు పడి మృతిచెందిందా... ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం

కైకలూరు: పెద్దింట్లమ్మ దేవస్థానం కోనేరు వద్ద వ్యాన్ ఢీ కొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఏలూరు జిల్లా చాటపర్రు నుంచి భక్తులు వ్యాన్‌పై కొల్లేటికోట అమ్మవారి దర్శనానికి వచ్చారు. దేవస్థానం వద్ద పార్కింగ్ చేయకుండా వ్యాన్‌ను నేరుగా కోనేరు వద్దకు డ్రైవర్ తీసుకెళ్ళాడు. అక్కడ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. స్తంభంతో పాటు విద్యుత్ వైర్లు తెగి వ్యాన్‌పై పడ్డాయి. అయితే ఎలాంటి ప్రమాదం జరగదు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: గణేష్ ఆలయంలో దీపారాధన చేస్తూ ప్రమాదవశాత్తు దీపం అంటుకుని వృద్ధురాలు అగ్నిప్రమాదానికి గురికాగా.. విజయవాడలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఏలూరు గుడివాడ వారి వీధికి చెందిన జే.సత్యవతి (70) గణేష్ ఆలయంలో మే 31న దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు దీపం ఆమె చీరకు అంటుకుంది. తీవ్ర గాయాలైన సత్యవతిని విజయవాడలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక వస్తున్న మరో లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఏలూరు సమీపంలో కలపర్రు టోల్‌ప్లాజా వద్ద విజయవాడ నుంచి ఏలూరు వైపు వస్తున్న లారీని రోడ్డు పక్కన నిలిపాడు. రాజమహేంద్రవరం సమీపంలోని నామవరానికి చెందిన ఎం.సత్యనారాయణరెడ్డి (45) ఆదివారం తెల్లవారు జామున లారీతో రాజమండ్రివైపు వస్తున్నాడు. మధ్యలో కలపర్రు టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపక్కన ఆపిన లారీని గమనించకపోవటంతో ఢీకొట్టాడు. ప్రమాదంలో సత్యనారాయణరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మొగల్తూరు మామి‘డీలా’

- పండు ఈగ కాటుకు రైతులు విలవిల
- గతంలో టన్ను మామిడికి రూ.40 వేలకు పైగా రాబడి
- టన్ను రూ.15 వేల నుంచి రూ. 25 వేల లోపే అమ్మకాలు
- లీజు, పెట్టుబడి ఖర్చులు రావడం లేదని వాపోతున్న రైతులు
- మొగల్తూరు, నరసాపురం మండలాల్లో 1800 ఎకరాల్లో సాగు


సీతారామపురం మార్కెట్‌లో ఉదయం అమ్ముడుపోక మిగిలిపోయిన పండ్లు


పండుఈగ వాలకముందు మామిడి పండు


పండుఈగ వాలాక కాయపై ఏర్పడిన మచ్చలు

సాక్షి, భీమవరం: చూడచక్కని రంగు.. మధురమైన రుచితో మనసు దోచే పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మామిడి ప్రతికూల వాతావరణం, పండుఈగ దాడితో ధర లేక వెలవెలబోతోంది. స్థానిక అమ్మకాలు, దేశ విదేశాలకు ఎగుమతులతో ఏటా రూ.32 కోట్లకు పైగా వ్యాపారం జరిగితే, ఈ ఏడాది సగం అమ్మకాలు లేని పరిస్థితి. తోటల లీజు, పెట్టుబడి ఖర్చులు రాక తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని 1800 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఎకరాకు ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. సారవంతమైన నేలలతో ఈ ప్రాంతంలోని మామిడి కాయలు 500 గ్రాముల నుంచి 700 గ్రాములకు పైగా బరువుతో మంచి రంగు, రుచి కలిగి ఉంటాయి. సహజసిద్ధంగా కాయలు పక్వానికి వచ్చాక మాత్రమే కోసి అమ్మకాలు చేయడం వల్ల ఇక్కడి బంగినపల్లి, రసాలు తదితర మామిడి పండ్లకు గిరాకీ ఎక్కువ. ఎంతోమంది వీటిని కొనుగోలు చేసి దేశ విదేశాల్లోని తమ బంధువులు, స్నేహితులకు పంపిస్తుంటారు.

పండు ఈగ దాడికి విలవిల

ఏటా ఏప్రిల్ మొదటి వారం నుంచి మొగల్తూరు మామిడి పండ్లు మార్కెట్‌లోకి రావడం మొదలై జూలై రెండు, మూడు వారాలతో ముగుస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే అకాల వర్షాలతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు పండు ఈగ ఉధృతి పెంచేందుకు దోహదం చేశాయి. మొదట్లో ఈదురుగాలుల ప్రభావంతో కాయలు రాలిపోయి నష్టపోతే తర్వాత పండు ఈగ తమను కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు అంటున్నారు. ఈగల వల్ల కాయలపై మచ్చలు ఏర్పడటం, సకాలంలో వినియోగించకపోతే పండు లోపల పురుగు పడుతుండటం అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంలో ఢిల్లీ, రాజస్తాన్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు తోటల వద్దకే వచ్చి టన్నుల్లో ఆర్డర్లు ఇస్తే, ఈ ఏడాది మార్కెట్‌కు తెచ్చినా కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రానంతగా అమ్మకాలు దిగజారాయని చెబుతున్నారు. చిరు వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడే మొగల్తూరు, నరసాపురం, సీతారామపురం మార్కెట్లు వెలవెలబోతున్నాయి. సాధారణంగా తెల్లవారుజాము మూడు గంటలకు మార్కెట్లు మొదలై తెల్లవారేసరికి ముగిసిపోతుంటాయి. ప్రస్తుతం తెచ్చిన సరుకు ఉదయం 10 గంటల వరకు కూడా అమ్ముడుపోని పరిస్థితి ఉంటోందని వ్యాపారులు అంటున్నారు.

నష్టాల్లో రైతులు

గతంలో టన్ను మామిడి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అమ్మకాలు చేస్తే ఈ ఏడాది రూ.15 వేల నుంచి రూ.25 వేల లోపే ఉంటోందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. చెట్ల సైజు, సంఖ్యను బట్టి ఎకరాకు లీజు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండగా, జూలై, ఆగస్టు నెలల్లో చెట్ల మొదలులో మందులు, ఎరువులు పెట్టడం, డిసెంబరులో పూత మొదలైన నాటి నుంచి జూలైలో కాపు పూర్తయ్యేవరకు రేయింబవళ్లు తోటల వద్ద కాపలా, కోత, మార్కెట్‌కు తరలింపు తదితర రూపాల్లో రూ.లక్ష వరకు ఖర్చులు అవుతున్నాయంటున్నారు. మార్కెట్‌లోకి తెచ్చి అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. గతంలో నాలుగుసార్లు మందులు పిచికారీ చేస్తే సరిపోయేదని, ఈసారి ఏడు సార్లు పిచికారీ చేసినా ఖర్చులు పెరిగాయే తప్ప ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ప్రతికూల వాతావరణం పండు ఈగ వ్యాప్తికి కారణమైందని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. కొందరు రైతులు మొదట్లోనే కాయలపై ఈగలు వాలకుండా కవర్లు (కవర్ కల్చరింగ్) కట్టే విధానాన్ని పాటించి సత్ఫలితాలు పొందారన్నారు. దాదాపు రెండు లక్షల కవర్లు కట్టినట్టు అధికారి ఒకరు తెలిపారు. పూర్తిస్థాయిలో రైతులు అందరూ ఈ విధానాన్ని అవలంబించేలా కార్యాచరణ చేస్తున్నట్టు వివరించారు.

ఒక టన్నూ పంపలేదు



10 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు తోటల వద్దకే వచ్చి ఆర్డర్లు ఇచ్చి వెళ్లేవారు. గత ఏడాది లారీకి పది టన్నులు చొప్పున నాలుగు లారీల మామిడిని ఢిల్లీకి పంపితే పండు ఈగ ప్రభావంతో ఈ ఏడాది ఒక టన్నూ పంపలేకపోయాను. కోత ఖర్చులు రావడం లేదని కొందరు రైతులు కోయకుండానే వదిలేస్తున్నారు.
– కొప్పినేని రామకృష్ణ, రైతు, పేరుపాలెం

సబ్సిడీపై కవర్లు అందజేయాలి



మునుపెన్నడూ లేనివిధంగా ఈ సీజన్‌లో తీవ్రంగా నష్టపోయాం. ఏడాది పాటు కష్టపడితే కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. ఎన్నిసార్లు మందులు కొట్టినా ఫలితం లేదు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. మామిడి కాయలకు కవరుకు రెండు రూపాయలు, కట్టేందుకు కూలీ ఖర్చు రూపాయి అవుతోంది. ప్రభుత్వం కవర్లను సబ్సిడీపై అందజేయాలి.
– కూనపురెడ్డి సాంబమూర్తి, వైఎస్ పాలెం

ఎప్పుడూ ఇలా లేదు



మామిడి కాయల సీజన్‌లో సీతారామపురం మార్కెట్‌లో టన్ను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అమ్మకాలు జరిగేవి. రోజుకు రూ.నాలుగైదు లక్షల వ్యాపారం జరిగేది. ఇప్పుడు టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు మాత్రమే ఉంటోంది. రోజువారి వ్యాపారం రూ.లక్ష లోపే ఉంటోంది. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు.
– నాగరాజు, వ్యాపారి, సీతారామపురం

5న భీమవరంలో చెస్ టోర్నమెంట్


భీమవరంలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 5న రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అనసూయ చెస్ అకాడమీ కోచ్ మాదాసు కిషోర్ చెప్పారు. ఆదివారం టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో నిర్వహించే టోర్నమెంట్‌లో అండర్–5, 7, 9, అండర్ 11, అండర్ 13, అండర్ 15, బాల, బాలికలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకోసం 90632 24466 నెంబరులో సంప్రదించాలన్నారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మ చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో భక్తులు రద్దీ ఎక్కువగా కనిపించింది. పవిత్ర కోనేరులో స్నానాలాచరించిన భక్తులు పెద్దింట్లమ్మకు మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ ఈవో మాట్లాడుతూ ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, ఇలా అన్నీ కలిపి రూ.85,340 ఆదాయం వచ్చిందని చెప్పారు.

విచ్చలవిడిగా మట్టి అక్రమ రవాణా


జుత్తిగ గ్రామంలో మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్


పెనుమంట్రలో మట్టి రవాణా చేస్తున్న మైనర్లు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో జుత్తిగ, మల్లిపూడి, మాముడూరు, పొలమూరు, పెనుమంట్ర, భట్లమగుటూరు, వెలగలేరు గ్రామాలలో ఆదివారం రెవెన్యూ అధికారులకు సెలవు కావడంతో మట్టిమాఫియా రెచ్చిపోయింది. ట్రాక్టర్లపై మట్టిని అక్రమ రవాణా చేశారు. గ్రామాల్లోని రోడ్లపై వేగంగా దూసుకుపోవడంతో ప్రజలకు రోడ్లపై ప్రయాణించేందుకు భయపడ్డారు. కొన్ని చోట్ల మైనర్లే ట్రాక్టర్ డ్రైవర్లుగా మారి మట్టి రవాణా చేశారు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ


అనివేటి మండపంలో భక్తుల రద్దీ


శ్రీహరి కళాతోరణ వేదికపై కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వేసవి సెలవులు ముగుస్తుండటంతో క్షేత్రానికి భక్తులు పోటెత్తుతున్నారు. దాంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, కల్యాణ కట్ట తదితర విభాగాలు భక్తులతో నిండిపోయాయి. ఉచిత ప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. శ్రీహరి కళాతోరణ వేదికపై పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

- మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసి పాలన సాగిస్తున్నారు
- పవన్‌కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదు?
- మాజీ మంత్రి కారుమూరి ధ్వజం


భీమవరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

సాక్షి, భీమవరం: వెన్నుపోటు రాజకీయాలకు సీఎం చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసి తల్లులు, పిల్లలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు అన్ని వర్గాలనూ వంచన చేస్తూ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాధిత, పీడిత ప్రజల పక్షాన ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ ఏమైపోయారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఆయన కోసం కాపు కాసిన వారికి న్యాయం చేయలేకపోతున్నారన్నారు. కాపు సామాజికవర్గంలో మెజారిటీ వర్గం పేదవారేనని, వారికి కాపు నేస్తం, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి తదితర ఏ పథకం అందడం లేదన్నారు. ప్రజల కోసం సీఎం చంద్రబాబును పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన ప్రశ్నించారు.

అన్ని వర్గాలనూ ఆదుకున్న ఘనత జగన్‌దే..

అన్ని వర్గాలనూ ఆదుకున్న ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని కారుమూరి చెప్పారు. తమ ప్రభుత్వంలో పేదలకు పథకాలు ఇవ్వబట్టే సంక్షేమం, అభివృద్ధి జరిగిందని తెలిపారు. నేడు వ్యాపారాలే లేవని, టోకుగా సొమ్ము మొత్తం దుబాయికో, సింగపూర్‌కో తరలించేస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం జగన్ హయాంలో రూ.3.31 లక్షల కోట్లు అప్పుచేశారని అసెంబ్లీలో చెప్పిన మంత్రి పయ్యావుల కేశవ్ ఇప్పుడు రూ.10 లక్షల కోట్లు అంటూ బయట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయనది నోరా? తాటిపట్టా? అని ప్రశ్నించారు. కూటమి పాలనలో మర్డర్లు, ఇళ్లు కూల్చడాలు, ఇష్టానుసారంగా కేసులు పెట్టడాలు, డైవర్షన్ రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. తండేల్ సినిమాలో చూపించినట్లు ఇక్కడ జెట్టీలు లేక మత్స్యకారులు గుజరాత్‌కు వెళుతుంటే.. 6 జెట్టీలు కట్టించిన మంచి మనసున్న వ్యక్తి మాజీ సీఎం జగన్ అన్నారు. ఆరు పోర్టులు, జిల్లాకు ఒకటి చొప్పున మెడికల్ కళాశాలలు కట్టారని చెప్పారు. మెడికల్ కాలేజీలకు 750 మెడికల్ సీట్లు వస్తే వద్దని లేఖ రాసిన గొప్ప సీఎం చంద్రబాబునాయుడని కారుమూరి ఎద్దేవా చేశారు.

మళ్లీ రేషన్ కోసం గంటల తరబడి క్యూ..

తణుకు అర్బన్: సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు విద్యుత్ బిల్లుల మోత మోగిస్తున్నారని, ఉద్యోగాలిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు తొలగించారని కారుమూరి మండిపడ్డారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎండీయూ ఆపరేటర్లందరినీ రోడ్డుకు ఈడ్చారని, రేషన్ దుకాణాల వద్ద మళ్లీ క్యూలో నిల్చునే పరిస్థితితోపాటు బియ్యం మూటలను ఇంటికి మోసుకుని వెళ్లే రోజులను తీసుకువచ్చారన్నారు. ఒక ఎమ్మెల్యేని మించి మరొక ఎమ్మెల్యే మద్యం, పేకాట, క్రికెట్ బుకీలే ఆదాయ వనరుగా మార్చుకుని మహిళల మంగళసూత్రాలను కూడా అమ్మించే పరిస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. ఇంకా ధాన్యం డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయలేదని తప్పుపట్టారు. ఏడాదిలో వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేశారన్నారు.

4న వెన్నుపోటు దినం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా గుర్తించి ఆయా నియోజకవర్గాల పరిధిలో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

శివారు గ్రామాల సంగతి ఏంటి?

- రేషన్ కోసం కిలోమీటర్లు వెళ్లిల్సిన దుస్థితి
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక వృద్ధుల అవస్థలు


తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి రేషన్ దుకాణం వద్ద వృద్ధుల పడిగాపులు

దెందులూరు: జూన్ 1 నుంచి అమలు చేస్తున్న రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీ అనేక మంది లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేస్తోంది. 90 శాతం శివారు గ్రామాల్లో రేషన్ షాపులు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు రేషన్ సరుకుల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేశారు. రేషన్ షాపులు లేని శివారు గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో ఇంటి ముంగిట రేషన్ సరుకులు అందాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనా ముద్ర కనపడకూడదన్న శివారు గ్రామాల్లో రేషన్ షాపు లేకపోవడంతో రేషన్ షాపులు ఉన్న గ్రామాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాను పోను రెండు కిలోమీటర్లు దూరంతో పాటు ఒక పూట కూలి పని మానుకొని షాపుకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి. శివారు గ్రామాల్లో, అటవీ ప్రాంతాల్లో రేషన్ షాపులు లేని చోట ఎవరు తెచ్చి ఇస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .రేషన్ షాపులు లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా కక్షపూరితంగా రద్దు చేసినట్టు ఉందని ప్రశ్నిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో బీసీ ఎస్టీ ఎస్సీ సామాజిక వర్గ ప్రజలే అధికంగా జీవిస్తున్నారని వారి హక్కులు పరిరక్షించకుండా పథకాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు రేషన్ డీలర్ల సైతం ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు.

60 ఏళ్లు పైబడిన వారందరికీ ఇంటికి వెళ్లి రేషన్ ఎప్పుడు ఇస్తారు.. ఎలా చెల్లిస్తారు అనే విషయంలో లిఖితపూర్వక హామీ ఆదేశాలు లేవు. తమకు స్పష్టమైన ఆదేశాలు లేకపోతే యూనియన్ పరంగా నిర్ణయం తీసుకుంటామని డీలర్ల యూనియన్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలందరికీ రేషన్ సరుకులు అందకపోయినా, ఏర్పాట్లు చేయకపోయినా దళిత గిరిజన మైనారిటీ బీసీ సంఘాలు ఏకమై భవిష్యత్ ప్రణాళికను ప్రకటించేందుకు సమాయత్తమవుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన :

ఏలూరు జిల్లాలో శివారు, అటవీ ప్రాంతాల్లో షాపులు లేకుండా సరుకులు ఎలా ప్రజలకు అందిస్తారని, శివారు గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానికంగా రేషన్ షాపులు తక్షణమే ఏర్పాటు చేయాలి అలా జరగని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని ఆదివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర మాలసేన నాయకులు గంటా పండు నిరసన వ్యక్తం చేశారు.

శివారు గ్రామాల పరిస్థితి ఏంటి?



వ్యాన్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసే పథకాన్ని రద్దు చేసినప్పుడు ప్రతి ఒక్కరికి రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి. శివారు గ్రామాల్లో రేషన్ షాపులు లేవు. షాపులు ఏర్పాటు చేయకుండా వాహనాల ద్వారా పంపకుండా శివారు గ్రామాల ప్రజలకు ఎలా పంపిణీ చేస్తారు.
పల్లెం ప్రసాద్ , ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

రద్దు తొందరపాటు నిర్ణయం



వాహనాల ద్వారా సరఫరా రద్దు తొందరపాటు నిర్ణయం . అనేక అంశాలు సమీక్షించి పరిగణలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తదుపరి రద్దు చర్యలు చేస్తే బాగుండేది. ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రజలందరికీ నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలి.
శనివల్లి వెంకటేశ్వరరావు, వినియోగదారుడు

ప్రజా విశ్వాసం కోల్పోయింది



సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని, గ్రామాలు మారుస్తామని హామీలు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా ఏ పథకం అమలు చేయలేదు.
రాము, వైఎస్సార్‌సీపీ నేత, సత్యనారాయణపురం

ఆపరేషన్ సిందూర్‌లో నేను సైతం


ఏలూరు వట్లూరు గ్రామంలో హవల్దార్ మేకా శివాజీతో గ్రామస్తులు


సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద శివాజీ

ఏలూరు టౌన్/పెదపాడు: దేశం తనకేమి చేసిందనేది కాకుండా... దేశానికి తాను సేవ చేయాలనే దృఢ సంకల్పంతో సైన్యంలో చేరిన హవల్దార్ మేకా శివాజీ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని స్వగ్రామం వట్లూరు వచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని తొలిసారి స్వగ్రామానికి వచ్చిన శివాజీకి వట్లూరు కబడ్డీ యూత్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, స్నేహితులు కలపర్రు టోల్‌ప్లాజా నుంచి ఘనస్వాగతం పలికారు. భారీ ర్యాలీగా గ్రామానికి తీసుకెళ్లారు. వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శివాజీకి సన్మానం చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మేకా పోతురాజు, రాజ్యం దంపతుల కుమారుడు శివాజీ. ఆయనకు భార్య స్వాతి, కుమార్తె నిత్య, కుమారుడు భరత్ ఉన్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో అమృత్‌సర్ నుంచి యుద్ధంలో పాల్గొన్నానని శివాజీ తెలిపారు. కోట్లాది మంది భారతీయుల తరఫున యుద్ధంలో పాల్గొనటం గర్వంగా ఉందన్నారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

గోగులమ్మకు ప్రత్యేక పూజలు


భక్తులచే గోగులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసియున్న గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. గరగలు, ఘటం ధరించిన ఆశాధులు పలు ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు చల్ది నైవేద్యాలు, ఓర పోసే నీళ్ల సమర్పించారు. ఆలయ సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం సమరసత సేవా ఫౌండేషన్ మహిళా కన్వీనర్ బోణం వెంకట లక్ష్మి, శిష్య బృందంచే కోలాట కృత్య భజన ఏర్పాటు చేశారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం


కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ దండు పద్మావతి

అత్తిలి: శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ప్రబోధాలకు ప్రేరణ పొంది పీఠం సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకివీడుకు చెందిన డాక్టర్ దండు పద్మావతి అన్నారు. పీఠం అనుబంధ సంస్థ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా ఆదివారం మండలంలోని బల్లిపాడు గ్రామంలో పీఠం సభ్యురాలైన దారపరెడ్డి మహేశ్వరి కిడ్నీ ఆపరేషన్ నిమిత్తం రూ.70,750 చెక్కును అందజేశారు. డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో బల్లిపాడు గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఐరన్ ర్యాక్‌లను బహూకరించారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తక ప్రదర్శన చేస్తున్న రిసోర్స్ పర్సన్లు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పుస్తక పఠనంతోనే విజ్ఞానమని, విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు రిసోర్స్ పర్సన్లు పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. స్పష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల కలలను సాకారం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు కోపెల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు, యువత, పెద్దలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వి.జనార్దనరావు లెక్కలు, చిట్కా అంకెలు చెప్పారు. ఎం.పుష్పవతి విద్యార్థులకు యోగా నేర్పించారు. గరికపాటి బాపయ్య శర్మ పలు అంశాలను అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

'పది' ప్రతిభావంతురాలికి అభినందన


విద్యార్థిని నవ్యరెడ్డిని అభినందిస్తున్న అంజిరెడ్డి

పెంటపాడు: విద్య ద్వారానే గుర్తింపు సాధ్యమని రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధి సొసైటీ గౌరవ అధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వీరంపాలెం జెడ్పీ స్కూలుకు చెందిన నవ్యరెడ్డి 586 మార్కులు సాధించడంపై ప్రత్యేకంగా అభినందించారు. సంఘ సభ్యులు పోతంశెట్టి లక్ష్మి, చిర్ల సత్యనారాయణరెడ్డి, ద్వారంపూడి పవన్‌కుమార్, అఖిల్, శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, రమేష్‌రెడ్డి, మురళీరెడ్డి, పెద్ద అబ్బులురెడ్డి, కేతినీడి రాంబాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలు జిల్లాల నుంచి ఇప్టూ అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు (బీఓసీ బోర్డు) చైర్మన్ వలవల బాబ్జీకి ఇప్టూ బీఓసీ సంఘ నాయకులు, సభ్యులు ఆదివారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకటేశ్వర్లు, బి.వెంకట్రావు, నాయకులు పోలారి, కేవీ రమణ, కాకర్ల శ్రీనివాస్, మోహన్, ఏసురత్నం, గఫూర్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు కూటమి వంచన

- అన్నదాతకు 'కూటమి' వంచన
- ఏడాది గడుస్తున్నా అన్నదాత సుఖీభవ లేదు
- ఉచిత పంట బీమా లేదు
- ఉసూరుమనిపించారని రైతాంగం ఆవేదన

తణుకు అర్బన్: వ్యవసాయం దండగన్న నాటి చంద్రబాబు మాటలను నేడు కూటమి ప్రభుత్వం పాటిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి మంచి చేయలేదని వాపో తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అసలు రైతాంగం ఉందో లేదో అనే రీతిలో పాలన చేస్తున్నారని గతంలో విరాజిల్లిన రైతు భరోసా కేంద్రాలు నేడు ఆ సేవలు కునారిల్లుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ పాలనకు తగ్గట్టుగానే అధికారులు సైతం రైతుల గోడు వినిపించుకునే పరిస్థితిలో లేరని దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని చెప్పిన కూటమి నేతలు ఏడాది గడిపేశారు. కానీ ఇంత వరకు ఆ పథకం పత్తా లేకుండా పోయిందని విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛను వెయ్యి పెంపు తప్ప విద్యార్థులు, మహిళలు, రైతాంగం ఇలా ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు.



అత్తిలిలో రైతుసేవా కేంద్రం

అటకెక్కిన పంటల బీమా

గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఉచిత పంటల బీమాను సైతం కూటమి ప్రభుత్వం ఎత్తి వేసి ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. దీంతో రైతాంగానికి ఆ ఖర్చు కూడా తడిసి మోపెడుగా మారిందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లిన సందర్భాల్లో ఏ పంటకు ఆ సమయంలోనే నష్టం రైతాంగానికి అందడంతో ఊపిరి పీల్చుకునే వారు. కానీ నేడు రైతాంగానికి ఊరటనిచ్చే విధంగా ఏ ఒక్క పథకం అమలు చేయకపోగా గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో అందిన పథకాలను సైతం నిలిపి వేయడంతో రైతాంగం ప్రస్తుత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు.

నిర్వీర్యమైన ఆర్బీకేలు

రైతు భరోసా కేంద్రాల పేరుతో గతంలో రైతాంగానికి విశేష సేవలందించిన ఆర్బీకేలను నేడు రైతు సేవా కేంద్రాలుగా మార్చి సేవలను నిర్వీర్యం చేశారని రైతాంగం బాధ పడుతున్నారు. విత్తు నుంచి పంట ఉత్పత్తి, దిగుబడుల వరకు రైతాంగానికి అన్ని రకాలుగా అండగా నిలబడాల్సిన రైతు భరోసా కేంద్రాలు నేడు సమస్యల వలయంతో కునారిల్లుతున్నాయి. ఆర్బీకేలకు రైతుల రాకపోకలే తగ్గిపోవడంతో కళా విహీనంగా మారిపోయాయని నాటి రోజులే బాగుండేవని రైతులు వాపోతున్నారు. రైతులకు ఏ సమాచారం అవసరమైనా ఆర్బీకేల రూపంలో వెసులుబాటు ఉండేదని కానీ నేడు అధిక శాతం తాళాలే దర్శనమిస్తున్నాయంటూ వాపోతున్నారు.

రైతన్నకు అండగా జగనన్న సర్కారు

అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌లో రైతన్నకు గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రాధాన్యత కల్పించారు. ప్రతి ఏడాది రైతు భరోసా పేరుతో రూ.15వేలు అందజేసి, రైతుకు పెట్టుబడి రూపంలో అండగా నిలబడింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. పంటలకు ఉచితంగా బీమా చేయించి పంట నష్ట పరిహారాన్ని సైతం రోజుల వ్యవధిలోనే రైతులకు అందజేసి వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా నిలిచారు. దీంతో ఏడాది కూటమి పాలనపై రైతాంగం విమర్శలు గుప్పిస్తోంది. ఏడాది గడుస్తున్నా ఇంత వరకు రైతు గురించి ఆలోచనే లేదంటూ కూటమి ప్రభుత్వాన్ని రైతులు ఎండగడుతున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో రైతులకు ఉన్నత సేవలు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో మొత్తం 49 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా 31 కేంద్రాలకు భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకొని సేవలు అందిస్తున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు


రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక పాతూరు 12వ వార్డు కనకదుర్గమ్మగుడి ప్రహరీ గోడను ఆనుకొని ఏర్పాటు చేసిన 100 కేవీఏ పవర్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం రాత్రి 10 గంటల సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని స్థానికులు విద్యుత్ లేక ఇక్కట్లు పడ్డారు. ఆదివారం ఉదయం 6.30 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటం, ఏసీల వాడకం పెరగడంతో ఒక్కసారిగా ఓవర్‌లోడ్ పడిందంటున్నారు. విద్యుత్ పరిమితి మించడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లోని సర్క్యూట్ ట్రిప్ అయ్యింది. హౌసింగ్ బోర్డు వద్ద నుంచి సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశారు. అనంతరం కొంత సమయానికే మరోసారి ట్రిప్ కావడం ఇలా ఉదయం వరకు పలుమార్లు ట్రిప్ అవుతూ వచ్చింది. సిబ్బంది రావడం మరమ్మతులు చేయడం ఇలా రాత్రంతా స్థానికులు నిద్రకు దూరమయ్యారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఒకవైపు వేసవి ఉక్కబోతతోనూ మరో వైపు దోమల బెడదతో ఇబ్బందులు పడ్డారు. తెల్లవార్లూ జాగారం చేశారు. ఈ ప్రాంతంలో 100కేవీఏ బదులు 160కేవీఏ పవర్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండాలని, లేని పక్షంలో పలుమార్లు ట్రిప్ అయ్యే అవఅవకాశం ఉందని సిబ్బంది అంటున్నారు. ఇదిలాఉంటే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మొక్కలు, తుప్పలు మొలిచి అస్తవ్యస్తంగా ఉంది. పరిసరాలను పరిశుభ్రం చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై నార్త్ ఏఈ వివరణ కోరగా పీక్‌లోడ్ అవర్స్‌లో సాయంత్రం సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పరిశీలిస్తామన్నారు.

'వ్యయ' సాయమే..

- రైతుకు దక్కని భరోసా.. సకాలంలో అందని సంచులు
- పంట వానార్పణం.. ఇదీ కూటమి ప్రభుత్వంలో పరిస్థితి

తాడేపల్లిగూడెం: వైఎస్ఆర్ రైతు భరోసా, సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ వంటి పథకాలతోపాటు, కృషీ వలులకు ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు ఒకే వేదికపై అందజేయడానికి సాంకేతికతను అందించేందుకు వీలుగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. సకాలంలో విత్తనాలు, ధాన్యం నేరుగా ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండానే మిల్లులకు చేరే వ్యవస్థ గత ప్రభుత్వం రైతులకు చేరువ చేసింది. వ్యవసాయం రైతుల కృషికి తగిన ఫలాలను ఇచ్చింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే వ్యవసాయం కాస్తా వ్యయ సాయంగా మారింది. వాతావరణం అనుకూలించక ముమ్మారు ఎర్ర కాలువకు వరదలు రావడం, రైతులు మూడు సార్లు నారుమళ్లు వేసుకోవాల్సి వచ్చింది. ఈ తరుణంలో ప్రభుత్వం రైతుల భుజం తట్టి మేమున్నామనే భరోసాను ఇవ్వలేక పోయింది. తీరా పంట చేతికొచ్చే సరికి ధాన్యం తరలించడానికి గోనె సంచులను సరఫరా చేయలేకపోయింది. మాసూళ్లు పూర్తయిన ధాన్యాన్ని బరకాలు కప్పుకొని రాత్రులు రైతులు రోడ్లపై జాగారం చేయాల్సి వచ్చింది. రసాయనిక ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

గతమెంతో ఘనం

రైతుల పరిస్థితి ఆనంద డోలికల్లో ఓల లాడింది. వైఎస్ఆర్ రైతు భరోసా కింద 60,506 మందికి 56 కోట్ల రూపాయల మేర సాయం అందింది. సున్నా వడ్డీ పంట రుణాలుగా 14 వేల మందికి పైగా రైతులకు రెండు కోట్ల మేర సాయం అందించారు. ఉచిత పంటల బీమా 19 వేల మందికి సాయ పడింది. ఇన్‌పుట్ సబ్సిడీ 10,600 మందికి అందింది.

వంచక ప్రభుత్వాన్ని నిలదీయాలి


నిరసన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఏడాది పాలనలో అబద్ధాలు, మోసాలు, వంచనకు పాల్పడిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఈ నెల 4న వెన్నుపోటు దినంగా నిరసనలు తెలియజేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి నేతలు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందించే వరకు పార్టీ తరఫున పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఎంపీపీ రుద్రా ధనరాజు, వద్లూరి సీతారాం, యిండుగపల్లి బలరామకృష్ణ, జల్లూరి జగదీష్, పొట్ల సురేష్, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, పెన్మెత్స సుబ్బరాజు, కోట నాగేశ్వరరావు, ఎండీ హబీబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండాలమ్మ జాతర

అత్తిలి: స్థానిక బల్లిపాడు రోడ్డులో వేంచేసియున్న శ్రీకొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆసాదుల గరగనృత్యాలు, కాళికా మాత నృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. దాసరి శ్రీనివాస్ దంపతులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు.

చెస్‌లో బాలశ్రీ కార్తీక్ ఉత్తమ ప్రతిభ



ఉత్తమ ప్రతిభ చూపిన బాలశ్రీ కార్తీక్

తాడేపల్లిగూడెం (టీటీసీ): చెస్ రేపిడ్ విభాగంలో పట్టణానికి చెందిన వంగపండు బాలశ్రీ కార్తీక్ ప్రతిభ చూపారు. ఇటర్నేషనల్ చెస్ ఫిడే రేటింగ్ (రేపిడ్ విభాగం)లో 1556 రేటింగ్ సాధించారు. కార్తీక్ భారతీయ విద్యాభవన్స్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మే 3, 4 తేదీల్లో హైదరబాద్ బంజార్ హిల్స్‌లో మెరిడియన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కార్తీక్ తండ్రి బాల మురళీకృష్ణ తెలిపారు. కార్తీక్ గ్రాండ్ మాస్టార్ స్థాయికి చేరుకోవాలని పలువురు అభినందించారు.

ఇంటింటికీ ఉచిత వైద్యం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్యం నిర్వహించారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, వేల్పూరు, సావరం ప్రాంతాల్లో వాహనంలో పర్యటించి ఇంటికే పరిమితమైన 10 మంది వృద్ధులకు వైద్యసేవలందించారు. కె.రామమోహన్ రావు అల్లూరి కరుణాకర చౌదరి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ సేవలు అభినందనీయం


కళాకారులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): రంగస్థల కళాకారుల సేవా సంఘం సేవలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. సంఘం 156 నెలవారీ సభా కార్యక్రమం స్థానిక నందిబొమ్మ కూడలి రామాలయం ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. సభకు సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షత వహించారు. ఆరుగొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు నూకల బుల్లియ్య, న్యాయవాది ఎస్వీ, శ్రీశ్రీ అంతర్జాతీయ కవితా వేదిక కార్యదర్శి కొల్లి రమావతి మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా కళాకారుల సంఘం పేద కళాకారులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ పడాల దుర్గ, మధు మందేశ్వర్ దంపతులకు గౌరవ సత్కారం, భజన గురువు ఆవుల కొండలరావుకు (కొమ్మర) కళా సత్కారం, ఉపాధ్యాయులు కడలి సత్యనారాయణ (ఇరగవరం)లకు ఉత్తమ ఉద్యోగ సేవా పురస్కారం అందజేశారు. హరికథ కళాకారిణి ఎస్.విజయలక్ష్మికి ఆర్థిక సత్కారం చేశారు. షేక్ ఫాతిమా ప్రార్థనాగీతం ఆలపించారు. సినీ సంగీత విభావరి, నండూరి లక్ష్మీ యశోద చైత్రికచే కూచిపూడి నృత్యాలు అలరించాయి. సంఘ ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి మాస బాబురావు, ఉపాధ్యక్షుడు ఏలూరు జగదీష్, కార్యదర్శి శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి మరమ్మతులు


మహానేత వైఎస్సార్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టిన దృశ్యం

పెంటపాడు: వెలంపేట కోనేరుచెరువు వద్ద మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గత నెల 28న గుర్తు తెలియని దండగులు ధ్వంసం చేవారు. ఆయన ఎడమ చేయి మోచేతి వరకు విరిగిపోయింది. అయితే ఈ సంఘటనకు సంబంధించి విగ్రహ మరమ్మతులను ఎవరూ పట్టించుకోకపోవడంపై గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు బర్ల జయరాంబాబు విచారం వ్యక్తం చేస్తూ తన సొంత ఖర్చుతో మరమ్మతులు చేపట్టారు.దీంతో వైఎస్సార్ అభిమానులు జయరాంబాబు చొరవకు అభినందిస్తున్నారు.

లబ్ధిదారులకు మొదలైన ప'రేషన్'

- రేషన్ షాపుల వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు
- పాత రోజులు వచ్చాయంటూ గుసగుసలు
- సర్వర్ పని చేయలేదంటూ వెనుదిరిగిన వైనం

తణుకు అర్బన్: రేషన్ ఇస్తున్నారు డిపోలకు వెళ్లి లైన్‌లో నిలబడాలని లేకుంటే అయిపోయాయని అంటారని ఒక మహిళ. ఒకడుగు ముందుగా వెళితే తొందరగా బియ్యం దొరుకుతాయి లేకపోతే మధ్యాహ్నం అవుతుందని మరో వృద్ధురాలు. బియ్యం ఇస్తారో లేక సర్వర్ పని చేయడం లేదంటారో అంటూ వృద్ధుడు ఇలా ఆపసోపాలు పడుతూ ఆదివారం రేషన్ డిపోల వద్దకు చేరారు ప్రజానీకం. తీరా ప్రతి డిపోలోను లబ్ధిదారులు అధికసంఖ్యలో రావడంతో క్యూలో నిల్చుని సరుకులు తీసుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. వివరాల్లోకి వె ళ్తే..పౌరసరఫరా ద్వారా అందుతున్న బియ్యం తదితర నిత్యావసర సామగ్రిని ఇంటి గుమ్మంలోకే అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వాహన సేవలను ప్రభుత్వం నిలిపి వేయడంతో ఆదివారం నుంచి చౌకడిపోల వద్దే సరుకుల పంపిణీ ఆదివారం నుంచి ప్రారంభించారు. దీంతో ప్రజానీకం రేషన్ కార్డులు, సంచులు చేత పట్టుకుని రేషన్ డిపోల వద్ద క్యూలో నిలబడాల్సి వచ్చింది. గంటల తరబడి క్యూలో నిలబడలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వృద్ధులకు ఇళ్లకొచ్చి ఇస్తామని ప్రభుత్వం చెప్పినా చివరిలో వచ్చి బియ్యం అయిపోయాయంటారేమోనని వృద్ధులు సైతం కర్రలు పట్టుకుని మరీ రేషన్ దుకాణాలకు క్యూ కట్టారు.


తణుకు అర్బన్: రేషన్ దుకాణం వద్ద క్యూలో నిలుచున్న లబ్ధిదారులు


పెంటపాడు: అలంపురం రేషన్ షాపు వద్ద అవస్థలు పడుతున్న వృద్ధులు


తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి రేషన్ దుకాణం వద్ద వేలిముద్ర వేస్తున్న వృద్ధురాలు

నత్తనడకన రేషన్ సరుకుల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటింటికి రేషన్ పంపిణీ ప్రక్రియకు కూటమి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. పాత విధానంలో రేషన్ సరుకులు ఇస్తున్నారు. సర్వర్లు పని చేయకపోవడంతో రేషన్ దుకాణాల వద్దే కార్డుదారులు పడిగాపులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇంటి వద్దనే ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందించేవారు. గత నెల వరకు ఇదే విధానం కొనసాగింది. దీంతో రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు సమయం కేటాయించవలసిన అవసరం ఉండేది కాదు. మరలా పాత విధానం అమలులోకి రావడంతో రేషన్ దుకాణాలకు లబ్ధిదారులు క్యూకట్టారు. సాఫ్ట్‌వేర్ నవీకరణ వంటి కారణాలతో రేషన్ దుకాణాల వద్ద రేషన్ సరుకుల పంపిణీ కొంత ఆలస్యమైనట్లు డీలర్లు చెబుతున్నారు. ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే 44 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల పరిధిలో సుమారు 28,527 రేషన్ కార్డులు ఉన్నాయి. బియ్యంతో పాటు అరకిలో పంచదారను దుకాణాల ద్వారా కార్డుదారులకు సరఫరా చేశారు. తొలి రోజు ప్రతీ షాపు వద్ద 30 నుంచి 70 కార్డులకు మించి రేషన్ సరుకులు పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం సర్వర్లు పనిచేయకపోవడమేనని సదరు డీలర్లు పేర్కొంటున్నారు. రేషన్ దుకాణాలు నెలలో 15 రోజులు పాటు నిర్విరామంగా పనిచేస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా సర్వర్లు పని చేయకపోవడంతో కొందరు డీలర్లు షాపులను మూసివేశారు.

రేషన్ పంపిణీపై వృద్ధుల అవస్థలు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో రేషన్ పరేషాన్ అవుతోంది. పలు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన షాపుల అడ్రస్ వివరాలు తెలియక కొంతమంది ఇబ్బందులు పడుతుంటే, మరలా రేషన్ ఇవ్వరేమో అని వృద్ధులు సైతం షాపుల వద్ద తచ్చాటం కనిపించింది. కాగా అలంపురం వద్ద ఒక షాపులో సర్వర్ సరిగా పని చేయని కారణంగా వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇంటి వద్దే రేషన్ అందించాలి



కూలీ నాలీ చేసుకునే వాళ్లం. గతంలో ఇంటి వద్దే సరుకులు అందించడంతో వ్యాన్ వచ్చిన సమయంలో ఇంటి వద్ద అందుబాటులో ఉండే వాళ్లం. ప్రస్తుతం రేషన్ దుకాణాల వద్దకు వచ్చి సరుకులు పొందాలంటే కూలి పని పోయే పరిస్థితి. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– దేవరకొండ రమణ, పెదతాడేపల్లి

ప్రయాసపడి దుకాణానికి వచ్చాం



గ్రామంలోని నరసింహనగర్ నుంచి ప్రయాసపడి పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న రేషన్ దుకాణానికి చేరుకున్నాం. తీరా సర్వర్లు పని చేయడం లేదంటున్నారు. వృద్ధులం దూరాభారం నుంచి ఎలా రాగలం. ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలి.

– నెర్లగడ్డ వెంకమ్మ, చినతాడేపల్లి

సమస్యను పరిష్కరిస్తాం

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్, సర్వర్ల సమస్యతో రేషన్ సరుకుల సరఫరా కొంత ఆలస్యమైంది. ఆదివారం రాత్రికి సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాం. తిరిగి సోమవారం నుంచి రేషన్ సరుకుల సరఫరా పుంజుకునే అవకాశం ఉంది.

– ఎం.సునీల్‌కుమార్, తహసీల్దార్, తాడేపల్లిగూడెం

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: మలేరియా నివారణ మాసోత్సవం–జూన్ 2025 కార్యక్రమాన్ని ఆదివారం తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ ఆవరణలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో క్షేత్ర స్థాయి సిబ్బంది మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో యు.శివప్రసాద్, ఎ.భృంగేశ్వరరావు, ఎ.శ్రీరామమూర్తి, ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

తణుకు అర్బన్: స్వాతంత్ర్య సమర యోధుడు యువ కిశోరం భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఉభయ గోదావరి జిల్లాల శాసనమండలి సభ్యుడు బి. గోపీమూర్తి పేర్కొన్నారు. తణుకు మండలం వేల్పూరు గ్రామంలో మినీ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ భగత్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పోరాడి ఉరి కంభం ఎక్కిన యువ కిశోరం భగత్ సింగ్ గొప్ప దేశభక్తుడని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి వాసా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.